మౌలిక సదుపాయాలు కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న కో ఆప్షన్ సభ్యురాలు

నిజాంపేట్ : ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కో ఆప్షన్ సభ్యురాలు జ్యోతి కోరారు. ఈ మేరకు శుక్రవారం మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ హిల్ కౌంటి నుంచి సాయిబాబా గుడి వరకు సీసీ రోడ్డు, కేకేఎం కాలనీ ఫేజ్ 3 సత్యం వ్యాలీలో ఓపెన్ జిమ్, కేకేఎం కాలనీ 5 పూజిత ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎమ్మెల్యే సహకారంతో ప్రారంభమైందని, దానిని పూర్తిగా నిర్మించాలని కోరారు. డబుల్‌బెడ్ రూమ్ నివాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వారికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ నగర్‌లోని వైకుంఠధామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


బ్లాక్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ కృష్ణా యాదవ్

దుండిగల్: డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లోని లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని మున్సిపల్ కౌన్సిలర్ జక్కుల కృష్ణాయాదవ్ అన్నారు. దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లోని పలు బ్లాక్‌లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వివిధ రకాల వసతులు కల్పించామన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, నాయకులు గోపి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, ఎల్లా అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందిస్తాం

చింతల్: నీటి లీకేజీలను అరికట్టి సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని డీజీఎం రాజేష్ అన్నారు. చింతల్ జలమండలి సెక్షన్ పరిధి సుభాష్ నగర్‌లోని తాగునీటి చాంబర్ వద్ద ఏర్పడిన లీకేజీపై ఫిర్యాదుతో శుక్రవారం మేనేజర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. దగ్గరుండి సిబ్బందితో లీకేజీకి మరమ్మతులు చేయించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడ లీకేజీలు తలెత్తినా ఫిర్యాదు అందిన వెంటనే మరమ్మతులు చేసేలా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు.


లీకేజీకి మరమ్మతులు చేయిస్తున్న డీజీఎం రాజేష్

చిత్తారమ్మ జాతర షురూ

- వివిధ పూజలు.. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- సోమవారం వరకు ట్రాఫిక్ ఆంక్షలు


చిత్తారమ్మ దేవి

సుభాష్‌నగర్: గాజులరామారంలో చిత్తారమ్మ దేవి జాతర (స్వర్ణోత్సవాలు) శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు గణపతి పూజ, పుణ్యా వచనం, బోనాలు, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కూన అంతయ్య గౌడ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, ఆలయ కమిటీ సభ్యులు, బాలరాజు, నరసింహ, ఇంద్రసేన గుప్తా, సత్తయ్య, శంకర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, పెంటారెడ్డి, బుచ్చిరెడ్డి, గౌరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

పోలీస్ అధికారుల పరిశీలన

జాతర నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ బాలానగర్ డీసీపీ సురేష్, మేడ్చల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్ ఆలయాన్ని సందర్శించారు. జాతరలో ఎలాంటి ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులకు పలు సూచనలు చేశారు.


ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సూచనలు చేస్తున్న మేడ్చల్ డివిజన్ ట్రాఫిక్ డీసీపీ గుణ శేఖర్


బోనం సమర్పిస్తున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ట్రాఫిక్ మళ్లింపు

జాతర నేపథ్యంలో శనివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం వరకు షాపూర్‌నగర్ గాజులరామారం ప్రధాన రోడ్ల మార్గంలో ఆంక్షలు విధించారు. షాపూర్ నగర్ నుంచి గాజులరామారం వెళ్లే భారీ వాహనాలు బాలానగర్ డీసీపీ కార్యాలయం నుంచి జగద్గిరిగుట్ట మీదుగా, చిన్న వాహనాలను ఉషా ముల్లపూడి హాస్పిటల్ నుంచి, గాజులరామారం నుంచి షాపూర్ నగర్‌కు వచ్చే వాహనాలను దేవేందర్ నగర్, మెట్టుకాని గూడా మీదుగా మళ్లించనున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ సదుపాయం కోసం ఆలయం చుట్టు ఉన్న ఫంక్షన్‌హాల్‌లను కేటాయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ తదితరులున్నారు.

భక్తులు పోలీసులకు సహకరించాలి


కూన శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ అడ్వైజర్

కుత్బుల్లాపూర్ : చిత్తరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు చేపట్టామని కమిటీ అడ్వైజర్ కూన శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం నిర్వహించే ప్రధాన జాతరకు సుమారు 5 లక్షలకు పైగా జనం హాజరవుతారని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : 33/11కేవీ వికాస్ సబ్‌స్టేషన్ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని హైదర్‌నగర్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు కేంద్రీవర్, రత్నదీప్ బ్యాక్‌సైడ్, మయూరి నగర్, మియాపూర్ ఎక్స్‌రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి శ్రీలా గార్డెన్స్ ఫీడర్‌లో శ్రీలా గార్డెన్స్, నడిగడ్డ తండా, దోవ కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్యాంక్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, వేంకటేశ్వర కాలనీ, ఎంఎస్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

కొంపల్లి సెక్షన్ 11కేవీ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేవీఆర్ రోడ్డు, సిటీ ప్లానెట్, విజయశాంతి విల్లాస్, నోబెల్ ఎన్‌క్లేవ్, శివారెడ్డి గోదాం, ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు న్యూమార్క్ పృథ్వీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, శ్వేత శుభం అపార్ట్‌మెంట్స్, రాయల్ మిడోవ్స్ విల్లాస్, కేవీఆర్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులపై మేయర్ సమీక్ష


సమావేశంలో పాల్గొన్న మేయర్ తదితరులు

నిజాంపేట్ : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మేయర్ నీలా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. బాచుపల్లి, నిజాంపేట్ ఆయా డివిజన్ల పరిధిలో వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, వసతులు, అవసరమైన నిధులు, పెండింగ్ పనులు తదితర పనులపై చర్చించారు. సమావేశంలో కమిషనర్ సాబేర్ అలీ, ఎస్ఈ సత్యనారాయణ, కార్పొరేటర్లు ఆగం పాండు, విజయలక్ష్మి, సుజాత, వీరేందర్‌రెడ్డి, సుధాకర్, బాలాజీ, శిరీష, సురేష్‌రెడ్డి, వెంకటేష్, రవికిరణ్, పావని, రాజేశ్వరి, జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, జ్యోతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలపై నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

జగద్గిరిగుట్ట: సంక్రాంతి రోజు ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ దేశ స్వాతంత్య్రం పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకత్వం తరచుగా రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై, ఇప్పుడు దేశ స్వాతంత్ర్యంపై వక్రీకరణ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో కూడా జాతీయ పతాకాన్ని ఎగరవేయకుండా అవమానించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు హరినాథ్, సహాయ కార్యదర్శి దుర్గయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు, శాఖ కార్యదర్శులు సహదేవరెడ్డి, వెంకటేష్, ఇమామ్, సోమన్న, సామెల్, బాబు, అయోధ్య, యాదగిరి, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


ఉమేష్‌కుమార్

కుత్బుల్లాపూర్: పని నిమిత్తం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన ఉమేష్‌కుమార్(32) ఈ నెల 15న ఇంటి నుంచి కోకాపేటకు పని నిమిత్తం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో అతని ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

దుండిగల్: అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారుతుంది. రోడ్లపై ఏర్పడే గుంతలను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు నాసిరంగా మ్యాన్ హోళ్లను నిర్మించడంతో అవి వేసిన కొద్ది రోజులకే కృంగిపోతున్నాయి. ఈ క్రమంలో గమనించక రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. దుండిగల్ మున్సిపాలిటీలోని భాజిపల్లి చౌరస్తా ప్రధాన రహదారి నుంచి దుండిగల్ తండాకు వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోల్ కృంగిపోయింది. దీంతో స్థానికులు చెట్ల కొమ్మలను వేసి ప్రమాద హెచ్చరిక బోర్డులాగా ఏర్పాటు చేశారు.

కార్మికుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి


కార్మికులకు అగ్రిమెంట్ పత్రాన్ని అందజేస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల శ్రేయస్సు కోసమే పని చేస్తున్నానని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల ఇండస్ట్రీలోని శ్రీనిధి సెక్యూరిటీ ప్రింటింగ్‌లో కార్మికులకు వరుసగా 5 అగ్రిమెంట్లు చేసి ఏకంగా రూ.9 వేలు పెంచే విధంగా కృషి చేశారు. షాపూర్‌నగర్‌లోని మదన్‌గౌడ్ నివాసంలో అగ్రిమెంట్ మీద సంతకాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, సహదేవ్, ప్రధాన కార్యదర్శి అంబదాస్ కార్మికులు పాల్గొన్నారు.

100 మందికి గుండె ఆపరేషన్‌లు


ఆపరేషన్ విజయవంతమైన వారితో వైద్యులు

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లో దశల వారీగా మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలో 100 మందికి గుండె ఆపరేషన్‌లు విజయవంతంగా నిర్వహించారు. కోలుకున్న వారితో శుక్రవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ.. పేషెంట్ల జీవితాలను దృష్టిలో ఉంచుకుని గుండె ఆరోగ్యంగా ఉండేందుకు బైపాస్ సర్జరీలు చేయలేదన్నారు. ఆధునాతన టెక్నాలజీతో మినిమల్ ఇన్వేసిస్ సర్జరీ ద్వారా ఛాతిపై 3 ఇంచుల కోతతో విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించామన్నారు. నార్త్ హైదరాబాద్‌లోనే మొట్టమొదటగా డాక్టర్ హరీష్ బడామి(కార్డియాలజీ) ఆధ్వర్యంలో మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలను మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లోనే తక్కువ ఖర్చుకే చేస్తున్నామని తెలిపారు. రెండు వారాల్లో పేషెంట్లు పూర్తిగా కోలుకునే విధంగా గుండె ఆపరేషన్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన 10 నెలల్లోనే 100 మినిమల్ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. రానున్న 3 నెలల్లో రోబోటిక్ సర్జరీతో అతి తక్కువ సమయంలో పేషెంట్లు కోలుకునే విధంగా ఆధునాతన ఎక్యూప్‌మెంట్ మిషనరీల ఆధారంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో డాక్టర్ హరీష్ భదామి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రగతినగర్ అధ్యక్షుడిగా నరేంద్ర చౌదరి



నిజాంపేట్ : భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా నిజాంపేట కార్పొరేషన్‌లోని ప్రగతి నగర్ అధ్యక్షుడిగా తొండపు నరేంద్ర చౌదరిని మరోసారి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన నియామకానికి మద్దతు తెలిపిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను మరింత ఉత్సాహంతో నిర్వర్తిస్తానన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత


సర్వే నంబర్ 342లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాల కూల్చివేత పరంపర కొనసాగుతూనే ఉంది. గాజులరామారం సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన రెండు గదులు, సర్వే నంబర్ 221లో నిర్మించిన రెండు ప్రహరీలను శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇక సెలవు దినాల్లో సైతం నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కబ్జాలకు పాల్పడుతున్న వారి జాబితా తయారు చేస్తున్నామని, మరోమారు కబ్జాకు యత్నిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట గుట్టపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. గత ఐదు నెలల్లో రూ. 2.68 లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సభ్యులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస చారి, రవీందర్, వేణుగౌడ్, సునీత, ధర్మకర్తలు శేషా చార్యులు, సుధాకర్ రావు, మల్లికార్జున్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల నాలాలో పారుతున్న వ్యర్థ రసాయనాలు



రసాయనాలా కంపు..


ఇటీవల గండిమైసమ్మలో పట్టుబడిన ఓ ట్యాంకర్

- నాలాల్లో వ్యర్థ రసాయనాల డంపింగ్
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పీసీబీ అధికారులు నిఘా పెంచాలని వేడుకోలు

జీడిమెట్ల: నాలాల్లో రసాయనాల డంపింగ్ జోరుగా సాగుతోంది. ఘాటైన రసాయనాల దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలాకు ఆనుకుని ఉన్న ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూప కాలనీ, గంపలబస్తీ, సుభాష్‌నగర్, అయోధ్య నగర్, చింతల్ మాణిక్య నగర్‌లలో ఘాటైన రసాయనాల వాసన విపరీతంగా వస్తుంది. 5 రోజులుగా రాత్రి వేళల్లో ఎక్కువగా ఈ సమస్య ఉంటుందని పలు కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు నైట్ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు నాలాల్లో శాంపిళ్లు సేకరించి రసాయన వ్యర్థాలను నాలాల్లో వదులుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి..

కొంతమంది కేటుగాళ్లు బొంతపల్లి, గాగిల్లాపూర్, బొల్లారం, చౌటుప్పల్ ప్రాంతాల నుంచి వ్యర్థ రసాయనాలను ట్యాంకర్‌లలో తీసుకువచ్చి జీడిమెట్లలోని నాలాల్లో డంప్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పీసీబీ, పోలీసు అధికారుల నిఘా తగ్గడంతో వ్యర్థ రసాయన ట్యాంకర్‌లు జీడిమెట్లలో డంప్ చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రసాయన వ్యర్థాల పారబోత వ్యాపారం వల్ల అధిక లాభాలు వస్తుండటంతో కొంతమంది కేటుగాళ్లు ఇదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పగటి సమయంలో వ్యర్థాలను నింపుకొచ్చి రాత్రి వరకు చూసి నాలాల్లో డంప్ చేస్తున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక
- రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అర్హులకు అందించే దిశగా జిల్లా అధికార యంత్రాంగం పని చేయాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు. శుక్రవారం నగర శివారు శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబర్ ప్రకారం వ్యవసాయానికి యోగ్యమైనదా?, కాదా? అనే స్పష్టతను గుర్తించాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను నిర్వహించాలన్నారు. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా చెల్లిస్తుందని తెలిపారు. సాగుకు యోగ్యం కాని భూముల జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలన్నారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితాను పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీలో కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు. వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



- జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారురాలు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూముకుంటలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరి, డీఆర్‌డీఏ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుగుణబాయి, హౌజింగ్ పీడీ రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, ఎంపీడీఓ సుగుణ బాయి పాల్గొన్నారు.